
ప్రజాశక్తి

సోమవారం 1 ఏప్రిల్ 2024

5

విజయనగరం



నేడు గాన కోకిల రాక

ప్రజాశక్తి-విజయనగరం కోట



విజయనగరం వాసి, గానకోకిల పి.సుశీల సోమవారం జిల్లాకు రానున్నారు. నగరానికి చెందిన శ్రీ గురు నారాయణ కళాపీఠం తృతీయ వార్షికోత్సవం సందర్భంగా వారు అందిస్తున్న పరిపూర్ణ జీవిత సాఫల్య పురస్కారానికి ఆమె ఎంపిక అయ్యారు. ఈ నేపథ్యంలో సోమవారం ఆనంద గజపతి ఆడిటోరియంలో జరిగే కార్యక్రమంలో ఆమె ఈ అవార్డును అందుకోనున్నారు. 90 ఏళ్ల వయసులో ఆమె స్వస్థలానికి రాబోతున్నారు. ఇంతకుముందు ఆమె 2019లో జరిగిన మహారాజా ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల వందేళ్ల ఉత్సవానికి హాజరయ్యారు. ఆమెతోపాటు సినీ సంగీత దర్శకులు మణిశర్మ రానున్నారు.



కొండపల్లి శ్రీనివాస్

గజపతినగరంలో కొనసాగుతున్న అసమ్మతి

- పట్టు సడలని కె.ఎ.నాయుడు
- పట్టించుకోని శ్రీనివాస్
- నేడు చంద్రబాబును కలవనున్న నాయుడు

గజపతినగరం నియోజకవర్గంలో టిడిపిలో అసమ్మతి ఇంకా కొనసాగుతోంది. వేరు కుంపట్లు ఇంకా చల్లారలేదు. అయితే ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీనివాస్ ఇవేవీ పట్టించుకోవడం లేదు. పార్టీ కేడర్ ఎక్కువగా ఆయన వెంటే ఉన్నప్పటికీ, టికెట్ ఆశించి భంగపడ్డ కె.ఎ.నాయుడు వెంట కూడా కొంతమంది కీలక నాయకులు, మాజీ సర్పంచులు ఉన్నారు. దీంతో, నియోజకవర్గంలోని టిడిపి రెండు నావలపై నడుస్తోందనడంలో సందేహం లేదు.



కె.ఎ.నాయుడు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి


టిడిపికి చెందిన గజపతినగరం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కె.ఎ.నాయుడు పట్టుసడలడం లేదు. టికెట్ కోసం ఇంకా ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. అప్పటి వరకు ఓపికపట్టాలని ఆయన అనుచరులకు ఇంకా దిశానిర్దేశం చేస్తున్నారు. టికెట్ విషయమై సోమవారం పార్టీ అధినేత చంద్రబాబును కలవనున్నట్టు సమాచారం. గజపతినగరం ఎమ్మెల్యే అభ్యర్థిగా కొండపల్లి శ్రీనివాస్‌ను ఫిబ్రవరి 24న ప్రకటించిన విషయం విదితమే. ఆ మరుసటిరోజు నుంచే శ్రీనివాస్ ప్రచారం ప్రారంభించారు. దీంతో కంగుతిన్న కెఎ నాయుడు కూడా తన కేడర్ చెదిరిపోకుండా జాగ్రత్త పడ్డారు. పునపరిశీలనలో భాగంగా తనకు టికెట్ వస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తూ, అప్పటి వరకు వేచి ఉండాలని కూడా నియోజకవర్గంలోని తన అనుయాయులను కోరారు. కేడర్ క్రమంగా అభ్యర్థి శ్రీనివాస్ వెంట వెళ్తున్నప్పటికీ, సుమారు 15 ఏళ్లపాటు పార్టీని, నాయుడిని నమ్ముకుని ఉన్న కొంతమంది ముఖ్యనాయకులు జీర్ణించుకోలేకపోతున్నారు. నియోజక వర్గంలో.. గజపతినగరం, బొండపల్లి, గంట్యాడ, జామి మండలాల పార్టీ అధ్యక్షులు అట్టాడ లక్ష్మునాయుడు, కోరాడ కృష్ణ, కొండపల్లి భాస్కరనాయుడు, సూరన్నాయుడు, దత్తిరాజేరు వైస్ ఎంపిపి (పెదకాద) పెద్దింటి మోహనరావు, మానాపురం గ్రామానికి చెందిన ఎస్‌సి, ఎస్‌టి సెల్ జిల్లా మాజీ సభ్యుడు శీర రామారావు, బొండపల్లి మాజీ జెడ్‌పిటిసి బండారు బాలాజీ, గజపతినగరం ఎఎంసి మాజీ చైర్మన్ బుద్ధరాజు చంటిరాజుతో పాటు కొంతమంది నాయకులు ఇంకా నాయుడి వెంటే ఉన్నారు. ఈ విషయాన్ని స్వయంగా వారే చెబుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో శ్రీనివాస్ కార్యక్రమాలకు హాజరవుతున్నా, తామంతా కె.ఎ.నాయుడు వెంటే ఉంటామని చెప్పడం గమనార్హం. వారి ఒత్తిడిమేరకే మరోసారి చంద్రబాబును కలిసేందుకు కె.ఎ.నాయుడు వెళ్లినట్టుగా సమాచారం. మొన్నటి వరకు టిడిపికి వ్యతిరేకంగా, వైసిపికి అనుకూలంగా ఉన్న కొండపల్లి కొండలరావు కుమారుడు శ్రీనివాస్‌కి ఇవ్వడమేమిటని నాయుడు, ఆయన అనుయాయుల వాదన. వాస్తవానికి కె.ఎ.నాయుడికి నియోజక వర్గంలో పార్టీ సంబంధాలతో పాటు స్నేహపూర్వక సంబంధాలు కూడా అమితంగానే ఉన్నాయి. అందువల్లే ఇప్పటికీ అధిష్టానంతో పోరాటం చేయగలుగుతున్నారు. ఈ నేపథ్యంలో చివరి క్షణం వరకు టికెట్ కోసం ప్రయత్నించి, అప్పటికీ అవకాశం లేకపోతే భవిష్యత్తు కార్యాచరణ రూపొందించేందుకు సమాయత్త మౌతున్నారు. సుమారు 40 రోజులు కావస్తున్నా అధిష్టానం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో మరోసారి తన అనుచరగణాన్ని వెంటబెట్టుకుని వెళ్లారు. రాజకీయ కక్షతో జిల్లాకు చెందిన ఓ ముఖ్యనేత తనపై తప్పుడు రిపోర్టులు పంపారని, దాన్ని ఆధారం చేసుకుని అధిష్టానం తనను పక్కనబెట్టడం సబుబు కాదని బాబు ఎదుట నాయుడు వాదన వినిపించనున్నట్టుగా సమాచారం. శ్రీనివాస్, ఆయన తండ్రి కొండలరావు మాత్రం టిడిపి కేడర్ అంతా కలిసి వస్తున్నారని చెబుతున్నారు. త్వరలోనే కెఎ నాయుడు కూడా కలిసి వస్తారని, ఆశించిన వారికి టికెట్ దక్కకపోతే నిరాశ చెందడం ఎవరికైనా సహజమేనని అంటున్నారు. పార్టీ మాత్రం వీరిని ఒక్కటి చేసేందుకు ఎలాంటి ప్రయత్నమూ ఇప్పటి వరకు చేయలేదు. పరిస్థితి ఎలా మారబోతుందో వేచిచూడాల్సిందే. నాయుడు, శ్రీనివాస్ కలిస్తేనే పార్టీకి విజయావకాశాలు ఉంటాయని, లేదంటే వైసిపి తనకు అవకాశంగా మలుచుకునే ప్రమాదం ఉంటుందని టిడిపి కార్యకర్తలు వ్యాఖ్యానిస్తున్నారు.

కోండ్రుకు కాపు కాసేనా?

- రాజాం నియోజకవర్గంలో టిడిపికి వింత పోకడ
- నేటికీ ఎమ్మెల్యే అభ్యర్థికి మద్దతు నిలవని కళా గ్రూపు
- ప్రచారాలకు దూరంగా ఉంటున్న సెకెండ్ కేడర్
- కానరాని ప్రతిభ, గ్రీష్మ
- బుజ్జగించకుంటే భారీ మూల్యమే

రాజాం నియోజకవర్గంలో టిడిపిలో వింత పోకడ నడుస్తోందా? కళా, కోండ్రు గ్రూపుల మధ్య సయోధ్య కుదరడం లేదా? మాజీ స్పీకర్ ప్రతిభా భారతి సైతం ఎన్నికల్లో అంటీముట్టనట్టు వ్యవహరిస్తున్నారా? అంటే అన్నింటికీ అవుననే సమాధానమే వస్తోంది. తాజా రాజకీయ పరిణామాలు టిడిపి శ్రేణులను కలవరపరుస్తున్నాయి. ఈసారి ఎలాగైనా గెలవాలని చూస్తున్న మాజీమంత్రి, టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కోండ్రు మురళీమోహన్‌కు కళావెంకటరావు అనుచరులు సహకారం అందించే పరిస్థితి ప్రస్తుతానికి కనిపించక పోవడమే అందుకు ప్రధాన కారణం.





ప్రజాశక్తి-రేగిడి

రాజాం నియోజకవర్గంలో రేగిడి, వంగర, సంతకవిటి, రాజాం మండలాలు ఉన్నాయి.. ఈ నియోజకవర్గంలో కాపు సామాజిక తరగతికి సంబంధించి అధిక ఓట్లు ఉన్నాయి. టిడిపి సీనియర్ నేత కిమిడి కళా వెంకటరావు రేగిడి మండల నివాసి. గతంలో ఉనుకూరు నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా రాజాం నియోజకవర్గం ఎస్‌సికి రిజర్వుడ్ అయింది. రాజాంలో నివాసముంటున్న ఆయన.. ఎచ్చెర్ల జనరల్ రిజర్వేషన్ కావడంతో అక్కడి నుంచి మొన్నటివరకూ పోటీ చేస్తూ వచ్చారు. అయినప్పటికీ రాజాం నియోజకవర్గంలో మాత్రం కళావెంకటరావు పట్టు కోల్పోలేదు. రాజాం నియోజకవర్గంలో రెండు లక్షల 25 వేలకు పైగా ఓటర్లు ఉన్నారు. వీటిలో లక్షా 25 వేలకు పైగా బిసి ఓటర్లు ఉన్నారు. వీటిలో కళా గ్రూపు.. టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కోండ్రు మురళికి కాపు కాస్తే గెలుపు నల్లేరు మీద నడకేనని నాయకులు, విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

సహకారం అందించేనా?

శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల నియోజకవర్గం నుంచి కళా వెంకటరావు ఎమ్మెల్యే అభ్యర్థిగా టికెట్ ఆశించినప్పటికీ భంగపడ్డారు. ఒకటి, రెండు విడతల్లో కళాకు చోటు దక్కకపోవడంతో నియోజకవర్గంలో ఆయన అనుచరులు మౌనం పాటించారు. చివరి విడతలో చీపురుపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా కళాను టిడిపి అధిష్టానం ప్రకటించడంతో కొంతమేర కళా గ్రూపు శాంతించింది. ఇలాంటి నేపథ్యంలో రాజాం నియోజకవర్గానికి సంబంధించి కళావెంకటరావు తన గ్రూపుతో టిడిపి అభ్యర్థి కోండ్రుకు మద్దతుగా నిలుస్తారా? లేదా? అనే చర్చ వినిపిస్తోంది. కోండ్రుకు మద్దతుగా చర్చలు ఇంతవరకు లేవు. ఇదే పరిస్థితి కొనసాగితే టిడిపి భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని చెబుతున్నారు.

సెకెండ్ కేడర్‌ను కలుపుకెళ్లేనా?

కళా అనుచరులు పార్టీకి కట్టుబడి ఉంటామని పైకి చెబుతున్నా, ఇప్పటి వరకు కోండ్రు మురళి ప్రచారాలకు దూరంగా ఉన్నారు. రాజాం నియోజకవర్గంలో మాజీ స్పీకర్ కావలి ప్రతిభా భారతి, ఆమె కుమార్తె గ్రీష్మ జాడ లేదు. అందుకు కారణం లేకపోలేదు. టిడిపి ద్వితీయ శ్రేణి నాయకులను, ఆయా గ్రూపులను కోండ్రు కలుపుకెళ్లడం లేదనే విమర్శలున్నాయి. అందుకే వారంతా ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉంటున్నట్లు తెలిసింది. గత 2019 సార్వత్రిక ఎన్నికల్లో కోండ్రు టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా రంగంలోకి దిగగా, వైసిపి నుంచి కంబాల జోగులు పోటీలో ఉన్నారు. అప్పుడు కూడా కళా గ్రూపు నుంచి కోండ్రుపై వ్యతిరేకత ఉండేది. అప్పుడు కోండ్రు ఓడిపోయారు. 2024 లో కూడా అదే పరిస్థితి కొనసాగితే టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్నికల్లో భారీ మూల్యం చెల్లించక తప్పదు. ఈ నేపథ్యంలో అధిష్టానం రంగంలోకి దిగి సయోధ్య కుదుర్చుతుందో? లేదో? వేచి చూడాలి.



అభివాదం చేస్తున్న అశోక్, కలిశెట్టి, అదితి, మాధవి, తదితరులు

వైసిపిది టైంపాస్ పాలన


టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు అశోక్ గజపతిరాజు

ప్రజాశక్తి-విజయనగరం కోట

వైసిపిది టైంపాస్ పాలనని, ఆ పార్టీ హయాంలో ప్రజలకు ఎటువంటి మేలూ జరగలేదని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతిరాజు అన్నారు. ఆదివారం స్థానిక అశోక్ బంగ్లాలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టిడిపి అధికారంలో ఉన్నప్పుడు కేంద్రం నుంచి పనులు చేయించుకున్నామని, విభేదించినాడు తనతో సహా మిగతా వారు రాజీనామా చేశారని గుర్తుచేశారు. గత ఐదేళ్లపాటు వైసిపి ఎమ్‌పి ఏం చేశారని నిలదీశారు. కలిశెట్టి అప్పలనాయుడు పార్టీకి సేవ చేయడంతో ఆయనకు ఎమ్‌పి టికెట్ లభించిందని తెలిపారు. తన ఆరోగ్యం సహకరించక పోవడం వల్లే పోటీ చేయడం లేదని తెలిపారు. టికెట్ రాని వారికి నచ్చజెప్పే బాధ్యత తీసుకుంటానని చెప్పారు. అనంతరం ఎమ్‌పి అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తానన్నారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాలపైనా తనకు పూర్తి అవగాహన ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నెల్లిమర్ల జనసేన అభ్యర్థి లోకం మాధవి, టిడిపి ఉత్తరాంధ్ర కోఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, కార్యాలయ కార్యదర్శి రాజేష్ బాబు, పట్టణ అధ్యక్షులు పి.లక్ష్మీవరప్రసాద్, మండల అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, గంటా పోలినాయుడు, వేచలపు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

అదితి ప్రచారం

నగరంలోని 23వ, 25వ డివిజన్ల పరిధిలో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి అదితి గజపతిరాజు ఎన్నికల ప్రచారం చేశారు. మార్కెట్లో వ్యాపారుల సమస్యలను తెలుసుకున్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టిడిపి అధికారంలోకి రావాలని ఆమె తెలిపారు.



డిప్యూటీ స్పీకర్ కోలగట్లతో కలిసి ప్రచారంలో పాల్గొన్న ఎమ్‌పి బెల్లాన

అభివృద్ధి పాలనను ఆశీర్వదించండి

ఎన్నికల ప్రచారంలో ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అభివృద్ధి పాలనను మరోసారి ఆశీర్వదించాలని ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్.. ప్రజలను కోరారు. మండలంలోని జమ్మునారాయపురంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామితో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం చేపట్టారు. అనంతరం బెల్లాన మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో ఐదేళ్లపాటు సుపరిపాలన సాగిందన్నారు. మేనిఫెస్టోలో పొందుపరిచిన అంశాలను శతశాతం అమలు చేసిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. వాలంటీర్, సచివాలయ వ్యవస్థ ద్వారా అవినీతి రహితంగా పూర్తి పారదర్శకంగా అర్హులందరికీ పథకాలను అందించామన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు నడిపేన శ్రీనివాసరావు, పిఎసిఎస్ అధ్యక్షులు కెల్ల త్రినాథరావు, కెపి రాజు, సర్పంచ్ యడ్ల సత్తిరాజు, సువ్వాడ శ్రీను, వైసిపి నాయకులు కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.

200 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-విజయనగరం కోట


ధర్మపురి గ్రామంలో ఆదివారం రోటరీ క్లబ్ ఆధ్వర్యాన వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. సుమారు 200 మంది రోగులకు మెడికవర్, అర్ష, శ్రీనిధి మెడికేర్ వైద్యులు తనిఖీలు చేసి, మందులు అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ విజయనగరం సెంట్రల్ ప్రెసిడెంట్ వి.రాజేష్, సెక్రటరీ అరుణ్ సోదాని, డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కు పొందేందుకు

ఇదే చివరి అవకాశం

ప్రస్తుతం దేశమంతా ఎన్నికల సీజన్. పార్లమెంటుతోపాటు అసెంబ్లీ ఎన్నికలు కూడా నిర్వహిస్తుండటంతో రాష్ట్రంలో ఎన్నికల వేడి తారాస్థాయికి చేరుకుంది. ఇప్పటికే ఎన్నికల షెడ్యూల్ ప్రకటించగా, మరికొద్ది రోజుల్లో నోటిఫికేషన్ వెలువడి, నామినేషన్ల పర్వం ప్రారంభం అవుతుంది. మనల్ని పరిపాలించే పాలకులను ఎన్నుకొనే సువర్ణావకాశం ఇది. ఈ మహాక్రతువులో మనం కూడా భాగస్వాములు కావాలంటే, కేవలం ఓటుహక్కును కలిగి ఉంటేచాలు. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిది. అత్యంత విలువైన, అమూల్యమైన ఓటుహక్కును పొందడానికి ఇప్పటికీ అవకాశాన్ని కల్పిస్తోంది మన ఎన్నికల కమిషన్.

నేటితో 18 ఏళ్లు నిండిన వారంతా అర్హులే



ప్రజాశక్తి-విజయనగరంకోట

దేశంలో 18 సంవత్సరాలు దాటిన భారత పౌరులందరికీ ఓటుహక్కు కల్పిస్తోంది మన రాజ్యాంగం. దీనికి దరఖాస్తు సమర్పించడం ఒక్కటే పౌరులు చేయాల్సిన పని. ఈ ఏడాది ఈ నెల ఒకటో తేదీకి 18 సంవత్సరాలు నిండిన వారందరికీ ఓటు హక్కు పొందే అవకాశాన్ని కల్పించారు. వీరంతా ఈ నెల 14వ తేదీలోపల దరఖాస్తు చేసుకోగలిగితే, త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఓటు వేసే అవకాశం లభిస్తుంది. ఆ తరువాత దరఖాస్తు చేసినా ఈ ఎన్నికల్లో ఓటు చేసే అవకాశం మాత్రం ఉండదు. కొత్త ఓటు కోసం, లేదా చిరునామా మార్పు కోసం ఈ నెల 14వ తేదీలోపు వచ్చే దరఖాస్తులను మాత్రమే పరిశీలిస్తారు. వాటిని పదిరోజుల్లోగా పరిశీలించి, అర్హత ఉంటే ఓటర్ల జాబితాలో చేరుస్తారు. వీరికి మే 13న జరిగే ఎన్నికల్లో ఓటువేసే అవకాశం లభిస్తుంది. ఏప్రిల్ 14 తరువాత వచ్చే దరఖాస్తులను మాత్రం ఎన్నికల తరువాత మాత్రమే పరిశీలిస్తారు. వాస్తవానికి నామినేషన్లను దాఖలు చేసేవరకు ఓటు నమోదుకు దరఖాస్తు చేసే అవకాశం ఉంది. అయితే వచ్చిన వాటిని పరిశీలించి, జాబితాల్లో చేర్చడానికి పదిరోజుల సమయం పడుతుంది. కాబట్టి, దరఖాస్తు చేయడానికి చివరితేదీ ఏప్రిల్ 14గా నిర్ణయించారు.


ఎలా దరఖాస్తు చేయాలి ?

ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ తుదిదశకు చేరుకుంది. ఎన్నికల షెడ్యూల్ కూడా వచ్చేసింది. అందువల్ల ప్రస్తుతం ఆన్‌లైన్ ద్వారానే కొత్తగా ఓటు నమోదుకు, చిరునామా మార్పునకు అవకాశం ఉంది. 18 ఏళ్లు నిండినవారు ఓటర్ హెల్ప్‌లైన్ యాప్, హెచ్‌టిటిపిఎస్‌://విఒటిఇఆర్‌ఎస్.ఇసిఐ.జిఒవి.ఐఎన్/వెబ్‌సైట్, హెచ్‌టిటిపిఎస్‌://సిఇఒఎఎన్‌డిహెచ్‌ఆర్‌ఎ.ఎన్‌ఐసి.ఐఎన్/వెబ్‌సైట్ ద్వారా ఫారం-6లో దరఖాస్తు చేయాలి. చిరునామా, ఓటు బదిలీ మార్పు కోసం ఫారం-8 ద్వారా దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. వచ్చిన దరఖాస్తులను పదిరోజుల్లో పరిశీలన పూర్తిచేసి, నిర్ణయం తీసుకుంటారు. కొత్తగా ఓటుహక్కు పొందినవారి పేర్లను అనుబంధ జాబితా ద్వారా, అలాగే చనిపోయినవారు, ఆబ్సెంటీస్, బదిలీ ఓటర్ల వివరాలను ఎఎస్‌డి జాబితాలో నమోదు చేసి, ఆయా పోలింగ్ కేంద్రాల ప్రిసైడింగ్ అధికారులకు అందజేస్తారు. ఇప్పటికే ఓటు కోసం దరఖాస్తు చేసి, ఓటుహక్కు పొందిన వారికి ఇప్పటికే ఓటరు గుర్తింపు కార్డులను పంపించారు. మొదటి విడత 81,633, రెండో విడత 6,476 ఎపిక్ కార్డులను వారి చిరునామాకు పంపించారు.

ఓటు ఉందోలేదో తెలుసుకోవడం ఎలా ?

ఈ ఏడాది మార్చి 20వ తేదీ నాటికి జిల్లాలో సుమారు 15,47,922 మంది ఓటర్లు ఉన్నారు. కొత్త ఓటర్ల చేర్పింపు కొనసాగుతుండటంతో ఓటర్ల సంఖ్య క్రమంగా పెరుగుతూ వస్తోంది. జాబితాలో మార్పులు, చేర్పులూ కొనసాగుతున్నాయి. అయితే చాలా మందికి తమ ఓటుపై సందేహాలు ఉన్నాయి. తమ ఓటు ఎక్కడ ఉందో తెలుసుకొనేందుకు పలు మార్గాలు ఉన్నాయి. ఎన్నికల కమిషన్ ప్రకటించిన ఓటర్ల జాబితాల్లో తమ పేరును ఆన్‌లైన్ ద్వారా చూసుకోవచ్చు. బూత్‌ల వారీగా కూడా ఓటర్ల జాబితాలను ఇప్పటికే ప్రకటించారు. బిఎల్‌ఒల వద్దనున్న ఓటర్ల జాబితాలో కూడా తమపేరు తనిఖీ చేసుకోవచ్చు. కలెక్టరేట్‌లోని ఎన్నికల కంట్రోల్ రూమ్‌లో ఏర్పాటు చేసిన కాల్ సెంటర్ ఫోన్ నంబర్లు 08922-797120, 08922-797124 ను సంప్రదించి తమ ఓటు వివరాలను తెలుసుకొనే అవకాశాన్ని జిల్లా యంత్రాంగం కల్పించింది.

అవకాశాన్ని వినియోగించుకోవాలి



కొత్తగా ఓటుహక్కు పొందడానికి, అర్హత ఉన్న వారంతా ఈ నెల 14వ తేదీలోగా ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలి. వాటిని పరిశీలించి 10 రోజుల్లో నిర్ణయం తీసుకుంటారు. వీరికి మాత్రమే వచ్చే ఎన్నికల్లో కొత్తగా ఓటువేసే అవకాశం లభిస్తుంది. ఓటు వజ్రాయుధం లాంటిది. అర్హత ఉన్నవారంతా ఓటు హక్కు పొందడమే కాకుండా, ఎన్నికల్లో కచ్చితంగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలి.

- నాగలక్ష్మి, జిల్లా కలెక్టర్

భావితరాలకు దిక్సూచి 'కళింగ కథాజాడ'

పుస్తకావిష్కరణ సభలో రచయిత అట్టాడ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కళింగ ఆది ఆంధ్ర చరిత్ర తెలిపి, భవిష్యత్తు తరాలకు దిక్సూచిగా కళింగ కథాజాడ పుస్తకం నిలుస్తుందని ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు అన్నారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగంలో డిఇ చీకటి దివాకర్ ఉద్యోగ విరమణ సందర్భంగా స్థానిక జెడ్‌పి సమావేశ మందిరంలో ఆదివారం సభ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా దివాకర్ రచించిన కళింగ కథాజాడ అనే పుస్తకాన్ని ప్రముఖ సాహితీవేత్త వెలుగు రామానాయుడు ఆవిష్కరించారు. అనంతరం పుస్తకం గురించి అట్టాడ అప్పలనాయుడు మాట్లాడారు. వందేళ్ల చరిత్రను నేటి ప్రజలకు తెలియజేయాలనే ఉద్దేశంతో పుస్తకాన్ని తీసుకొచ్చినట్లు తెలిపారు. దాన్ని నాలుగు విభాగాల్లో సామాజిక, రాజకీయ, ఆర్థిక మార్పులు గురించి విశదీకరించారని తెలిపారు. సాహితీ వేత్తలకు జన్మస్థలం, గమ్య స్థలం సమాజమే అన్నారు. అటువంటి సమాజం గురించి మన పిల్లలకు తెలియజేయాల్సిన అవసరం మనపై ఉందన్నారు.



దివాకర్ దంపతులను సత్కరిస్తున్న సీనియర్ కళాకారుడు



కళింగ కథాజాడ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయితలు, అధికారులు

అనంతరం పుస్తక ప్రాముఖ్యతను రచయిత గంటేడ గౌరినాయుడు వివరించారు. ఈ సందర్భంగా చీకటి దివాకర్ ఉద్యోగిగా చేసిన కృషిని, సాహితీ వేత్తగా అందించిన సేవలను అట్టాడ అప్పలనాయుడు, గంటేడ గౌరినాయుడు, వెలుగు రామునాయుడు, మన్యం జిల్లా పిఆర్ ఎస్ఇ ఎంవిఆర్ కృష్ణాజీ, ఎంవిఎన్ వెంకటరావు, రిటైర్డ్ ఆర్‌డిఒ కెఆర్‌డి ప్రసాదరావు కొనియాడారు. అనంతరం పిఆర్ ఇంజినీరింగ్, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు, ఉద్యోగులు, సాహితీవేత్తలు, కళాకారులు.. దివాకర్, చంద్రిక దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో నాటక రంగ కళాకారులు శేషారావు, పిఆర్ ఎస్ఇ గుప్త, జెడ్‌పి సిఇఒ శ్రీధర్ రాజు, ఎంవిఎన్ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



ఇంటి పన్నులు వసూలు చేస్తున్న నగర పంచాయతీ సిబ్బంది

పన్నుల వసూళ్లలో ప్రథమ స్థానం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నెల్లిమర్ల నగర పంచాయతీ పన్ను వసూళ్లలో రాష్ట్రంలో ప్రథమ స్థానం సాధించిందని కమిషనర్ పి. బాలాజీ ప్రసాద్ తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక కార్యాలయంలో మాట్లాడుతూ నగర పంచాయతీలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్నులు (ప్రైవేటు) వసూళ్లలో భాగంగా రూ.128 లక్షలకు గాను రూ.126 లక్షలు వసూలు చేసి 98.50 శాతంతో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించినట్లు తెలిపారు. పన్ను వసూళ్లలో మేనేజర్ విశ్వేశ్వర రావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజ్యలక్ష్మీ, సిబ్బంది, సచివాలయ సిబ్బంది సహకారంతో రాష్ట్రంలో ప్రథమ స్థానం సాధించామన్నారు.



దుర్గారావును సత్కరిస్తున్న ఉద్యోగులు, యువత

తొంపాకి దుర్గారావుకు సన్మానం

ప్రజాశక్తి - వంగర

భారత అంధుల క్రికెట్ జట్టుకు కెప్టెన్‌గా ఎంపికైన తొంపాకి దుర్గారావుకు తమ స్వగ్రామం కొప్పరవలసలో ప్రభుత్వ ఉద్యోగులు ఆయన స్వగృహంలో ఆదివారం సత్కరించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు సాదేం ఉమామహేశ్వరరావు, పట్నం కృష్ణ, గొర్లె ఠాగూర్, తూముల సూర్యారావు, యువత, గ్రామస్తులు పాల్గొన్నారు.

వాలంటీర్ల పై బాబుకు ఎందుకంత కక్ష?

ప్రజాశక్తి- గజపతినగరం

టిడిపి అధినేత చంద్రబాబునాయుడు వాలంటీర్లపై కక్ష కట్టారని, అందుచేతనే ఈసీ ద్వారా వాలంటీర్ సేవలను నిలిపివేశారని ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య విమర్శించారు. ఆదివారం సాయంత్రం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నిర్వాకం కారణంగానే ఒకటో తేదీన అందవలసిన పింఛన్లు పంపిణీ ఆలస్యమవుతోందన్నారు. వాలంటీర్లు వ్యవస్థ పై ఉన్న పగను, వృద్ధులు, వికలాంగ పింఛన్ లబ్ధిదారులపై చూపిస్తున్నట్లుగా ఉందన్నారు. సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ వ్యవస్థాపకుడు నిమ్మగడ్డ రమేష్ కుమార్‌ను అడ్డుపెట్టుకుని ఈసీ ద్వారా వాలంటీర్ సేవలను చంద్రబాబు నిలిపివేయించారని ఆరోపించారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి గార తౌడు, పిఎసిఎస్ అధ్యక్షులు కరణం ఆదినారాయణ, సర్పంచ్ బెల్లాన త్రినాధరావు, ఉపసర్పంచులు మండల సురేష్, కర్రి రామ్ నాయుడు, కనకల సుబ్రహ్మణ్యం, వైసిపి మండల అధ్యక్షులు బూడి వెంకట్రావు, రేగ సురేష్ పాల్గొన్నారు.

అక్రమ మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని శిర్లాం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి 29 మద్యం బాటిల్స్‌తో ఆదివారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. ఎన్నికల దాడుల్లో భాగంగా మజ్జి రాముడు జంక్షన్ వద్ద మద్యంతో దొరికినట్లు తెలిపారు. వ్యక్తితో పాటు మద్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత

ప్రజాశక్తి- బొబ్బిలి

మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో టిడిపిని గెలిపిస్తే మౌలిక సౌకర్యాలు కల్పనకు ప్రాధాన్యత ఇస్తామని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బేబినాయన అన్నారు. పట్టణంలోని 14వ వార్డు పూల్ బాగ్‌లో ఆదివారం రాత్రి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. టిడిపిని గెలిపిస్తే పట్టణంలో మౌలిక సౌకర్యాలు కల్పిస్తామన్నారు. బేబినాయనకు అభ్యుదయ విద్యా సంస్థల ప్రిన్సిపాల్ చింతా శారద సైకిల్ బహుకరించారు. ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే తెంటు రాజా, జనసేన నియోజకవర్గ ఇంచార్జి గిరడ అప్పలస్వామి, టిడిపి నాయకులు, జనసైనికులు పాల్గొన్నారు.

102, 104, 108 డ్రైవర్లకు శిక్షణా తరగతులు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

102, 104, 108 వాహనాల పైలట్లకు ఆదివారం స్థానిక ఎన్జీఓ హోంలో శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఫ్లీట్ మేనేజర్ రామకృష్ణ మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా వాహనాల కండిషన్‌ను ఎప్పటికప్పుడు పరిశీలించి ఏమైనా పెద్ద సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. వాహనాల రికార్డులను, ఫిట్ నెస్‌ను, వాటి పరిస్థితిని పరిశీలించి వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి తరలిస్తున్న రోగులకు మంచి సేవలను అందించాలని సూచించారు. వాహనాల పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. 102, 104, 108 సేవల పట్ల సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో 108, 104 జిల్లా మేనేజర్లు మన్మధనాయుడు, దుర్గాప్రసాద్, 102, 104, 108 ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్‌లు విజయకుమార్, రాజశేఖర్, మురళీకృష్ణ సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణంలో రాజన్నదొర ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి - సాలూరు

డిప్యూటీ సిఎం రాజన్నదొర ఆదివారం ఉదయం పట్టణంలోని 17వ వార్డు అక్కేన వీధి, గూడెపు వీధి, అల్లువీధుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ, వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి జర్జాపు సూరిబాబు, జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు, అర్బన్ బ్యాంక్ అధ్యక్షులు జర్జాపు ఈశ్వరరావుతో కలిసి ఆయన ఇంటింటికీ తిరిగి జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించారు. టిడిపి అధినేత చంద్రబాబునాయుడు చెప్పిన హామీలన్నీ నీటిమూటలని విమర్శించారు. అలాంటి పార్టీని అధికారంలోకి తెచ్చుకుంటే పేదలు నష్టపోతారని చెప్పారు. ప్రజలు వాస్తవాలు తెలుసుకుని ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని రాజన్నదొర కోరారు.

ఎమ్మెల్యేను కలిసిన అరకు ఎమ్‌పి అభ్యర్థి

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, మన్యం జిల్లా వైసిపి అధ్యక్షులు పరీక్షిత్ రాజును అరకు పార్లమెంట్ వైసిపి అభ్యర్థి డాక్టర్ చెట్టి తనుజారాణి ఆదివారం చినమేరంగిలో మర్యాద పూర్వకంగా కలిశారు. వరుసగా అరకు పార్లమెంట్ నియోజకవర్గంలో ఉన్న వైసిపిఎమ్మెల్యేలను, ముఖ్య నాయకులను ఆమె కలిస్తున్నారు. దీనిలో భాగంగా కురుపాం ఎమ్మెల్యే దంపతులను కలిసి ఎంపి అభ్యర్థిగా తనను ఆశీర్వదించాలని కోరారు. పుష్పశ్రీవాణి, పరీక్షితరాజులు మాట్లాడుతూ ప్రజల ఆశీస్సులు మనకు ఎల్లప్పుడూ ఉంటాయని, విజయం మనదేనని భరోసా ఇచ్చారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలు శాంతియుతంగా మెలగాలి

ప్రజాశక్తి - వంగర



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ జనార్ధన్

ఎన్నికలు సమీపిస్తున్న వేళ గ్రామాల్లో ప్రజలు శాంతియుతంగా మెలగాలని ఎస్ఐ వైవి జనార్ధన్ అన్నారు. ఈ మేరకు ఆయన మండలంలోని శ్రీహరిపురం గ్రామంలో ఆదివారం పర్యటించి, గ్రామస్తులతో సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. ఎవరైనా మద్యం, నాటు సారా వంటివి విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చీకట్లో గురజాడ అప్పారావు నగర్

- తాగునీరూ కొనుక్కోవాల్సిందే
- దీన స్థితిలో నగర్ వాసులు

ప్రజాశక్తి- విజయనగరం టౌన్

జిల్లా కేంద్రం, జిల్లాను పరిపాలించే జిల్లా కలెక్టర్ కార్యాలయానికి, కలెక్టర్ ఇంటికి కిలో మీటర్ దూరంలో ఉంది గురజాడ అప్పారావు నగర్. ఇక్కడ సుమారుగా 50 కుటుంబాలు నివాసం ఉన్నాయి. ఇల్లు కట్టుకొని సుమారుగా 15 ఏళ్లు దాటినా నేటికీ విద్యుత్ సౌకర్యం లేదంటే పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవచ్చును. కొండలు మీద ఉన్న గిరిజన ప్రాంతాలకు సైతం విద్యుత్ అందిస్తున్న ప్రభుత్వాలు, పాలకులు జిల్లా కేంద్రంలో 15 ఏళ్లకు పై బడి విద్యుత్ లేకుండా చీకట్లోనే బతుకులు ఈడుస్తున్నా పట్టించుకోకపోవడం దారుణం. కూలి పనులు చేసుకుంటూ వచ్చిన డబ్బులతో కొంత కేటాయించి మూడు ఇళ్ళ వారు సోలార్ విద్యుత్ వాడుకుంటున్నారు. మిగిలిన కుటుంబాలు వారు దీపం బుడ్డీలే ఆధారంగా జీవిస్తున్నారు. రోజు తెచ్చుకున్న కూలీ డబ్బులు తిండికే సరిపోతుండటంతో సోలార్ పెట్టుకునే అవకాశం లేక చాలా మంది కారు చీకట్లోనే జీవనం వెల్లదీస్తున్నారు.

నగర్ ఏర్పడి 15 ఏళ్లు దాటినా నేటికీ విద్యుత్ లేదు. రోడ్లు లేవు. కాలువలు లేవు. మరుగుదొడ్ల సౌకర్యం లేదు. ఎటువంటి కనీస సౌకర్యాలూ లేక అనేక ఇబ్బందులు, అసౌకర్యాలు మద్య జీవనం సాగిస్తున్నారు. అక్కడున్న వాళ్ళు అందరూ పేదలు కావడంతో కనీసం వారి సమస్యలు వినే వారు, చూసే వారు కూడా లేకపోవడం దారుణం. సిపిఎం ఆధ్వర్యంలో అనేక మార్లు జిల్లా అధికారులకు, ప్రజాప్రతినిధులకు గురజాడ అప్పారావు నగర్ వాసులు సమస్యలు విన్నవించుకున్నా వారి గోడు పట్టించుకునే నాధుడే లేకపోయాడు. పిల్లలు చదువుకునేందుకు కలెక్టరేట్ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ బడులకు కాలినడకన వెళ్లి రావాల్సిందే తప్ప వాహన సదుపాయం లేదు. స్కూల్ కి వెళ్ళిన పిల్లలు ఇంటికి వచ్చే వరకు తల్లి తండ్రులు భయంతో ప్రతి రోజూ ఎదురు చూడాల్సిందే.



అభివృద్ధికి నోచుకోని గురజాడ అప్పారావు నగర్

కొనుక్కుంటేనే తాగునీరు

ఈ నగర్‌లో కనీసం తాగునీటిని కూడా ప్రభుత్వం సరఫరా చేయకపోవడంతో ప్రైవేటు వ్యక్తులు దగ్గర వాటర్ టాంకర్ నీరు కొనుక్కొని వాడుకుంటున్నారు. టాంకర్ నీటికి రూ.750లు వసూలు చేస్తున్నారు. టాంక్ నీరు వీధిలో ఉన్న వారు ఇంటికి ఇన్ని బిందెలు అని చెప్పి వాటిని వాడుకోవాల్సిందే. టాంకర్‌తో కొనుగోలు చేసిన నీటిని వీధిలో ప్లాస్టిక్ డబ్బాల్లో నిల్వచేసుకుని వినియోగించుకుంటున్నారు.

గతంలో బోరు ఏర్పాటు చేసుకున్నా..

గతంలో నగర్ వాసులంతా డబ్బులు ఎత్తుకొని బోరు ఏర్పాటు చేసుకున్నారు. అయితే ఆ బోరు ద్వారా తాగునీరు రాలేదు. దీంతో వాడుకలకు, తాగడానికి టాంకర్ నీరే నగర్ వాసులకు గతి అయింది.

కాలకృత్యాలకు కొండే గతి

మరో వైపు గురజాడ అప్పారావు నగర్ వాసులకు మరుగుదొడ్ల సౌకర్యం లేదు. దీంతో నగరాన్ని ఆనుకొని ఉన్న కొండ వెనుక వైపు కాలకృత్యాలు తీర్చుకావాల్సిందే. మహిళలు ఇద్దరు ముగ్గురు తోడుగా వెళ్లి కాలకృత్యాలు తీర్చుకొని రావాల్సిందే. ఒంటరిగా వెళ్లలేని పరిస్థితిలో నగర్ వాసులు జీవిస్తున్నారు.

చీకటి నుంచి కాపాడండి



పదిహేనేళ్లుగా చీకటిలోనే జీవిస్తున్నాం. విద్యుత్ సౌకర్యం కల్పించి వెలుగు నివ్వండి. ఎన్నిసార్లు అధికారులు, పాలకులకు విన్నవించినా ఎటువంటి ఉపయోగం లేదు. మాకు విద్యుత్, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించి రక్షణ కల్పించాలి.

డి.కరుణ, నగర్ వాసి

మౌలిక సదుపాయాలు కల్పించాలి



గత 15 ఏళ్లుగా ఇక్కడ ఎటువంటి సౌకర్యాలూ లేకుండా జీవిస్తున్నాం. కనీసం మరుగుదొడ్లు, తాగునీరు, రోడ్లు, కాలువలు, విద్యుత్ సౌకర్యం కూడా లేదు. మేము మనుషలం అనే విషయాన్ని అధికారులు, పాలకులు గుర్తించాలి. తాగేందుకు నీరు లేని స్థితిలో ఉన్నామంటే మా పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవాలి.

రంబ శ్రీనివాసరావు, నగర్ వాసి

ప్రజా సేవ కోసమే వచ్చా

యువనేత గొంప కృష్ణ

ప్రజాశక్తి- శృంగవరపుకోట

చంద్రబాబు, లోకేష్ పంపిస్తేనే నియోజకవర్గ ప్రజలకు సేవ చేసేందుకే వచ్చానని అందరూ బలంగా ఆదేశిస్తే స్వతంత్ర అభ్యర్థిగా రంగంలోకి దిగుతానని తన ప్రయాణం టిడిపి తోనే కొనసాగుతుందని నియోజకవర్గ యువనేత గొంప కృష్ణ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఆకుల డిపో వద్ద నిర్వహించిన బహిరంగ సభలో కృష్ణ మాట్లాడుతూ తాను, తన భార్య అమెరికాలో కార్పొరేట్ కంపెనీల్లో మంచి జీతాలకు పనిచేస్తున్నామని, డబ్బుకు, హోదాకు లోటు లేదని, అయితే ఈ సమయంలో తెలుగుదేశం అధినేత చంద్రబాబు, లోకేష్‌లు ఎస్ కోట నియోజకవర్గం వెళ్లి అక్కడ పార్టీని అభివృద్ధి చేయాలని, బలంగా తయారు పరచాలని ఆదేశించినట్లు చెప్పారు. దీంతో తాను, తన భార్య చేస్తున్న పెద్ద పెద్ద ఉద్యోగాలు వదిలి ఇక్కడికి వచ్చేశామన్నారు. గడిచిన రెండేళ్లుగా ఈ నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి అహర్నిశలు శక్తివంచన లేకుండా కృషి చేశామన్నారు. అయితే అధిష్టానం పార్టీ అభివృద్ధి చేయాలని చెప్పి టిక్కెట్ విషయంలో తనను మోసం చేసిందని అయినప్పటికీ తనకు టిడిపి అంటే అభిమానమేనని మీరు అందరూ బలంగా ఆదేశిస్తే తాను ఇక్కడ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని చెప్పారు. ఇప్పటికే యువత కోసం, మహిళ సాధికారకత కోసం, రైతుల కోసం చేపట్టిన ప్రతి కార్యక్రమం అందరికీ తెలుసునన్నారు.



సభకు హాజరైన గొంప కృష్ణ అభిమానులు

గడిచిన రెండేళ్లలో పార్టీని ఎంత బలోపేతం చేశానో నాయకులతో పాటు ప్రజలు కూడా గమనించారన్నారు. పార్టీని ఇంత అభివృద్ధి చేసిన తనకు టిడిపి అధిష్టానం టిక్కెట్ ఇవ్వకపోవడం తనతో పాటు తనను నమ్ముకొని ఉన్న కేడరును అసంతృప్తికి గురిచేసిందన్నారు. ఈ తరుణంలో తనను వేలాదిమంది ప్రజలు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయాలని కోరుతున్నారని దీనిని పరిశీలిస్తున్నట్లు చెప్పారు. అందరి ఆశీర్వాదం ఉంటే ఎమ్మెల్యేగా పోటీ చేసి తిరిగి టిడిపిలో చేరుతానని మాటిచ్చారు. తాను ఎమ్మెల్యేగా గెలిస్తే రాష్ట్రంలో ఎస్ కోట నియోజకవర్గానికి గుర్తింపు వచ్చేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. తనను నమ్మి సభకు వేలాది మంది రావడం తనకు మరింత గుండే ధైర్యాన్నిచ్చిందన్నారు. అనంతరం ఆకులు డిపో నుంచి దేవి బొమ్మ కూడలి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాయవరపు చంద్రశేఖర్, గొరపల్లి రాము, గొంప వెంకటరావు, గొప్ప రమాదేవి, భారతి, త్రివేణి, రెడ్డి పైడి బాబు, లగుడు రవికుమార్, జుత్తాడ రామసత్యం, మంగరాజు తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు అభివాదం చేస్తున్న గొంప కృష్ణ దంపతులు

చీపురుపల్లి టికెట్‌పై పునరాలోచించాలి

ప్రజాశక్తి- చీపురుపల్లి

చీపురుపల్లి టిడిపి టిక్కెట్‌పై అదిష్టానం పునరాలోచించి నిర్ణయం తీసుకోవాలని టిడిపి నాయకులు కిమిడి నాగార్జున కోరారు. తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో నాగార్జున మాట్లాడారు. టిడిపి ఆఖరి లిస్ట్ ఇచ్చిన తర్వాత చీపురుపల్లిలో నిరాశ నిస్పృహలు భగ్గుమన్నాయన్నారు. కొన్ని ప్రతిస్పందనలు తన గుండెకి హత్తుకున్నాయని, నాగార్జున అనే వ్యక్తి చీపురుపల్లి నియోజకవర్గంలోనే కాకుండా ఏడు నియోజకవర్గాలతో పాటు రెండు జిల్లాల్లోనూ ఎంతోమంది గుండెల్లో ఉన్నాడని ఈ సంఘటన తరువాత తనకు తెలిసిందన్నారు. ఎంతోమంది ఫోన్ చేసి మీరు చాలా కష్టపడ్డారు, మీకు మంచి భవిష్యత్తు ఉందని తనతో అంటున్నట్లు చెప్పారు. చాలా ప్రాంతాల నుంచి ఫోన్లు వస్తున్నాయని అందరూ బాధపడుతున్నారని ఇంత మంది గుండెల్లో చోట సంపాధించడం ఆనందంగా ఉందని చెప్పారు. తనకు నారా లోకేష్ ఆఫీస్ నుంచి ఫోన్ వచ్చిందని అక్కడకు రమ్మన్నారని నాయకులు, కార్యకర్తలతో చర్చించి లోకేష్ దగ్గరికి వెళ్లి ఇక్కడున్న వాస్తవ పరిస్థితులను వివరిస్తానని చెప్పారు. ఈ సమావేశంలో నాలుగు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కార్యకర్తలతో మాట్లాడుతున్న కిమిడి నాగార్జున

నేడు కళాను కలవనున్న గరివిడి నాయకులు

చీపురుపల్లి టిడిపి టిక్కెట్టు కిమిడి కళావెంకటరావుకి కేటాయించడంతో భగ్గుమన్న టిడిపి కేడర్ గత మూడు రోజులుగా చీపురుపల్లిలో నాగార్జున వర్గం ఆందోళన చేస్తుంటే, గరివిడికి చెందిన మరో వర్గం కళావెంకటరావుని కలిసేందుకు సోమవారం రాజాం వెల్లుతున్నట్లు ఆ పార్టీ నాయకులు రెడ్డి గోవిందనాయుడు తెలిపారు. పార్టీ ఆదేశాలే ముఖ్యమని ఆయన అన్నారు. పార్టీ ఎవరికి టిక్కెట్టు ఇచ్చినా తాము కష్టపడి అభ్యర్థిని గెలిపించుకునేందుకు కృషి చేస్తామని చెప్పారు. గరివిడి మండలంతో పాటు గరివిడి పట్టణం నుండి కళా వెంకటరావుని కలిసేందుకు పది కార్లలో నాయకులు వెలుతున్నట్లు గోవింద నాయడు తెలిపారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు

ప్రజాశక్తి - రామభద్రపురం

మండలంలోని ఉన్న అన్ని చర్చిల్లో క్రైస్తవ సోదరులు ఈస్టర్ పర్వదినం సందర్భంగా ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ముఖ్యంగా శతాబ్ద కాల చరిత్ర కలిగిన ఆరికతోట ఏడిఎంఎం బాప్టిస్ట్ చర్చిలో సంఘకాపరి సురేష్ కుమార్ ఆధ్వర్యంలో యేసయ్య ప్రార్ధనలు, గీతాలు ఆలపిస్తూ బైబిల్‌లో పేర్కొన్న వివిధ ప్రబోధనలు, సువార్త చదివి వినిపించారు. ఈస్టర్ దినం అతి పవిత్ర దినమని, సమస్త మానవాళి రక్షణార్ధం శిలువలో మరణించిన 3రోజుల పిదప తిరిగి ఈ పవిత్ర దినాన్న మృత్యువును జయించి తిరిగి లేచారని ఆ సందర్భంగా ఏటా పునారుద్దాన పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని చెప్పారు. ఈ ప్రార్ధనల్లో ముఖ్య అతిధి మాజీ సర్పంచ్ పెంకి భీమయ్య, చర్చి ప్రెసిడెంట్ చంద్రశేఖర్, సెక్రెటరీ జార్జ్ ఎబి నైజర్, ట్రెజరర్ ఆదియ్య, గ్రామ సర్పంచ్ పెంకి పుష్పమ్మ, వందలాది మంది ప్రభు భక్తులు పాల్గొన్నారు.



రామభద్రపురం: బోధనలు చేస్తున్న సురేష్‌కుమార్

బొబ్బిలి: పట్టణంలో ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సిబిఎం చర్చిలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు పాల్గొని ప్రార్ధనలు చేశారు. శాంతి, కరుణకు మారుపేరుగా యేసుక్రీస్తు నిలిచారని శంబంగి అన్నారు. క్రీస్తు మరణాన్ని జయించి లేచారని కారుణ్య ఫౌండేషన్ అధ్యక్షులు జేసీ రాజు అన్నారు. అన్ని చర్చిలలో ప్రార్ధనలు చేశారు.



బొబ్బిలి: ప్రార్థనలో పాల్గొన్న ఎమ్మెల్యే శంబంగి

విజయనగరం టౌన్: నగరంలో ఈస్టర్ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కంటోన్మెంట్ ఈస్టుకోస్టు జ్యూట్‌మిల్లు, బాలాజీ మార్కెట్ ప్రాంతాల్లో క్రైస్తువులు తెల్లవారు జామున సమాధుల వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్ధనలు చేశారు.

నవోదయలో త్రివేద్ ప్రతిభ

ప్రజాశక్తి- మెంటాడ



మెంటాడ గ్రామానికి చెందిన సువ్వాడ త్రివేద్ ఆదివారం ప్రకటించిన నవోదయ ఫలితాలలో 100 మార్కులకు గాను 94 మార్కులు సాధించి నవోదయ విద్యాలయంలో సీటు సాధించాడు. ఇటీవల ప్రకటించిన సైనిక్ స్కూల్ ఫలితాలలో 300 మార్కులకు గాను 258 మార్కులు సాధించి సైనిక్ స్కూల్ లోను సీటు పొందాడు. గ్రామీణ ప్రాంతానికి చెందిన త్రివేద్ ఇటు నవోదయ, అటు సైనిక్ స్కూల్ ఫలితాల్లో మంచి ప్రతిభ కనబరిచి సీటు సాధించినందుకు గాను తల్లిదండ్రులు గౌరీ నాయుడు, నాగలక్ష్మి, హర్షవర్ధన పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

సీతానగరం : మండలంలోని బగ్గందొరవలసకు లబ్బ షర్మిల, గోవిందరావు ఈ విద్యా సంవత్సరంలో నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో ప్రవేశానికి ఎంపికైనట్లు కృషి విజ్ఞాన కేంద్రం ప్రిన్సిపల్ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఇప్పటివరకు తమ పాఠశాల నుంచి 18 మంది విద్యార్థులు నవోదయ విద్యాలయానికి ఎంపికైనట్లు తెలిపారు. వీరి ఎంపిక పట్ల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

బలిజిపేట : మండలంలోని వెంగాపురానికి చెందిన శ్రీ భారతి ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థి భోగి వినయ్‌బాబు నవోదయలో ఉత్తీర్ణత సాధించినట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు జగన్, కరస్పాండెంట్ రామ్మోహన్రావు తెలిపారు. ఈ సందర్భంగా వినయ్ బాబుకు పాఠశాల సిబ్బంది స్వీట్లు తినిపించి అభినందనలు తెలిపారు

వీరఘట్టం: మండలంలోని సెయింట్ జేవియర్ పాఠశాలకు చెందిన గేదెల దీపక్, శ్రీగాయత్రి పాఠశాలకు చెందిన వడ్డీ జీవన్ దీక్షత్ ఆదివారం వెలువడిన జవహర్ నవోదయ ఫలితాల్లో ఎంపిక అయినట్లు పాఠశాల యాజమాన్యం తెలిపింది. జీవన్ దీక్షత్, శ్రీగాయత్రి పాఠశాలలో మొట్టమొదటిసారిగా ప్రారంభించిన నవోదయ కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేయడంతో నవోదయలో ఫలితం సాధించడంతో పాఠశాల కరస్పాండెంట్ ఎస్ లోకేష్ విద్యార్థులను అభినందించారు.

ప్రజల పక్షాన పోరాడే సిపిఎం అభ్యర్థిని గెలిపించండి

ప్రజాశక్తి - కొమరాడ

మతోన్మాద బిజెపిని, దాంతో పొత్తు పెట్టుకున్న టిడిపి, వైసిపి అభ్యర్థులను ఓడించి సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ నాయకులు కొల్లి సాంబమూర్తి పిలుపునిచ్చారు. ఆదివారం గుమడ సంతలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ఆవలంభిస్తున్న విధానాలు దేశ ప్రజల ఆర్థిక, సామాజిక భద్రతకు తీవ్ర నష్టం చేస్తున్నప్పటికీ రాష్ట్రంలోని అధికార వైసిపి, ప్రతిపక్ష తెలుగుదేశం, జనసేన బిజెపిని వ్యతిరేకించకపోగా బలపరచడం, జట్టు కట్టడం సిగ్గుచేటని విమర్శించారు. వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసే మూడు వ్యవసాయ చట్టాలను, కార్మికులకు నష్టం చేకూర్చే లేబర్‌కోడ్‌లను బిజెపి తీసుకొస్తే టిడిపి, వైసిపిలు బలపర్చాయని దుయ్యబట్టారు. ప్రభుత్వ సంస్థలైన ఎల్ఐసి, బిఎస్ఎన్ఎల్, రైల్వే, బ్యాంకులు, విశాఖ స్టీల్ ప్లాంట్ వంటి సంస్థలను ప్రైవేటుపరం చేసే పరిస్థితి ఉందన్నారు. అలాగే కొమరాడ మండలానికి సంబంధించి ఏనుగులు, పూర్ణపాడు వంతెన, తోటపల్లి నిర్వాసితులకు పరిహారం చెల్లింపు, జంఝావతి రిజర్వాయర్ పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అంతరాష్ట్ర రహదారి మరమ్మతుల సమస్యపై సిపిఎం అన్ని వేళలా పోరాటం చేస్తున్న సందర్భం ఉందని అన్నారు. ఇలాంటి సందర్భంలో బిజెపికి ప్రత్యక్షంగా, పరోక్షంగా మద్దతుగా ఉన్న టిడిపి, వైసిపిలను ఓడించి ప్రజల తరఫున నికరంగా పోరాడుతున్న సిపిఎం అభ్యర్థులను రాబోయే పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు వెంకటేశు, చక్రపాణి, రాజు, మధు, కైలాస్, రైతు సంఘం నాయకులు తాతబాబు, వెంకటినాయుడు, పాల్గొన్నారు.

'అవకాశమిస్తే అభివృద్ధి చేస్తా'

ప్రజాశక్తి- బొబ్బిలి

తనకు ప్రజలు అవకాశమిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బేబినాయన అన్నారు. మండలంలోని మామిడివలసకు చెందిన 30 వైసిపి కుటుంబాలు పార్టీని వీడి టిడిపి తీర్థం పుచ్చుకున్నాయి. వీరంతా ఆదివారం కోటకు చేరుకుని టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన సమక్షంలో టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా బేబినాయన మాట్లాడుతూ వైసిపి అరాచక పాలనకు విసుగు చెందుతున్న ప్రజలు టిడిపిలోకి వస్తున్నారన్నారు. పార్టీలో చేరిన వారిలో వి.పాపినాయుడు, కె.సన్యాసమ్మ, పి.సత్యనారాయణ, కె.పరిసినాయుడు, తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కె.భాస్కరరావు, ఎం.తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న బేబినాయన

అచ్చెన్న కుటుంబానికి సంతాపం

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెంనాయుడు మాతృమూర్తి కళావతమ్మ మృతి పట్ల బేబినాయన ఆదివారం సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసినట్లు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

చలివేంద్రాలు ఏర్పాటు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని అంటిపేట, అంటివలస గ్రామాల్లో చలివేంద్ర కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఇఒపిఆర్‌డి కెకె కుమార్‌వర్మ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ అన్ని సచివాలయ పరిధిలో త్వరలో చలివేంద్ర కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని సచివాలయ పరిధిలో ప్రయాణికులను దృష్టిలో పెట్టుకొని వడదెబ్బ నివారించేందుకు ఈ కేంద్రాలు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ఆయా పంచాయతీ కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, కె.శశిభూషణరావు పాల్గొన్నారు.

ఉమ్మడిగా పోరాడుదాం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

పట్టణ జనసేన కార్యాలయంలో ఆదివారం జనసేన నాయకులు చందక అనిల్ ఆధ్వర్యంలో జనసేన ఆత్మీయ కలయిక సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టిడిపి, బిజెపి, జనసేన ఉమ్మడి అభ్యర్థి బోనెల విజయచంద్ర పాల్గొన్నారు. అనంతరం అనిల్ మాట్లాడుతూ టిడిపి, జనసేన, బిజెపి అభ్యర్థిగా పార్వతీపురం నియోజకవర్గంలో విజయం సాధించే లక్ష్యంతో జనసేన సైనికులు మీవంతుగా గెలిపించేందుకు పోరాడాలని పిలుపునిచ్చారు. పార్వతీపురం నియోజకవర్గంలో టిడిపి, జనసేన, బిజెపి అభ్యర్థిగా నన్ను గెలిపించండి మీకు సేవకుడుగా ఎల్లవేళలా మీ అందరికీ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గొట్టపు వెంకటనాయుడు, సీతారాం, వెంకటేష్, రామారావు, భాస్కర్ రావు, జనసేన నాయకులు గోవిందమ్మ, కరుణ, ముఖేష్, సురేష్, కాళీ, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సేవలు గుర్తింపునిస్తాయి

ప్రజాశక్తి - సీతంపేట

ఉద్యోగ సమయంలో చేసిన సేవలు గుర్తింపునిస్తాయని శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్లు రుక్కుమ్మంగోధరయ్య, అన్నదొర అన్నారు. స్థానిక గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఐటిడిఎ ఇన్‌ఛార్జి డిప్యూటీ డిఇఒ ఎ.లిల్లీరాణి ఉద్యోగ విరమణ ఆ పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏజెన్సీలో అనేక పోస్టులు చేసి ఉత్తమ ప్రధాన ఉపాధ్యాయులుగా లిల్లీరాణి గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. ఏజెన్సీలో సుమారు 35ఏళ్ల పాటు గిరిజన విద్యార్థులకు అనేక సేవలు అందించి ఉన్నతంగా తీర్చిదిద్దారని కొనియాడారు. అనంతరం ఎన్జీవోల సంఘం రాష్ట్ర నాయకులు చౌదరి పురుషోత్తం నాయుడు, యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఆరిక భాస్కరరావు, జిల్లా కార్యదర్శి కె.కృష్ణారావు, కె.సింహాచలం పలు ఉపాధ్యాయులు లిల్లీరాణిని సన్మానించారు